రైతుల డిమాండ్లపై ప్రభుత్వ నిర్లక్ష్యం: పంధేర్

చండీగఢ్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గెలవడంపైనే కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించిందని, రైతుల డిమాండ్లను పట్టించుకోవడం లేదని రైతు సంఘం నేత సర్వణ్ సింగ్ పంధేర్ శుక్రవారం ఆరోపించారు. ఎంఎస్‌పీకి చట్టపరమైన హామీ ఇవ్వాలని, రైతుల డిమాండ్లపై దృష్టి సారించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేరే వరకు తమ నిరసన కొనసాగుతుందని స్పష్టం చేశారు. రైతుల 'ఢిల్లీ చలో' కవాతుకు సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా నాయకత్వం వహిస్తున్నాయి. ఖనౌరీ సరిహద్దుల్లో ఫిబ్రవరి 21న జరిగిన ఘర్షణల్లో రైతు శుభ్‌కరణ్ సింగ్(21) మరణించడం తోపాటు 12 మంది పోలీసులు గాయపడిన నేపథ్యంలో ధర్నాకు తాత్కాలిక విరామం ప్రకటించారు.

శుభ్‌కరణ్ తలలో తూటాలు

ఫిబ్రవరి 21న ఖనౌరీ సరిహద్దుల్లో జరిగిన ఘర్షణలో మరణించిన రైతు శుభ్‌కరణ్ (21) తలలో తూటా గాయం ఉన్నట్లు శవపరీక్ష నివేదిక వెల్లడించింది. ఆయన పుర్రెలో లోహపు పెల్లెట్లు ఉన్నాయని పాటియాలా హాస్పిటల్ తెలిపింది. గాయపడిన రైతుల శరీరాల్లో కూడా ఇటువంటి పెల్లెట్లు కనిపించాయని చెప్పింది. పెల్లెట్లను నిపుణులకు పంపించి, ఎటువంటి తుపాకీతో వీటిని ప్రయోగించారో తెలుసుకుంటారని సమాచారం.

వేసవి మొదట్లోనే మండే ఎండలు!

కొనసాగనున్న ఎల్‌నినో పరిస్థితులు

న్యూఢిల్లీ, మార్చి 1: ఎల్‌నినో పరిస్థితులు ఈ సీజన్‌లోనూ కొనసాగుతాయని, దీంతో ఈసారి భారతదేశంలో వేసవి ప్రారంభంలోనే ఎండ తాకిడి ఎక్కువగా ఉంటుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తాజాగా అంచనా వేసింది. గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే రోజులే ఎక్కువగా ఉంటాయని ఐఎండీ అంచనా వేస్తున్నది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. 'మార్చి-మే మధ్యలో దేశవ్యాప్తంగా కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలు మించి నమోదవుతాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తర కర్ణాటక, ఈశాన్య భారతంతో కూడిన ప్రాంతాల్లో సాధారణం కన్నా అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయి. మార్చి నెల దేశంలో సాధారణం కన్నా ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశముంది' అని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మోహపాత్ర మీడియా ముఖంగా చెప్పారు. మధ్య పసిఫిక్ మహా సముద్రంపై ఎల్‌నినో పోయి..లానినా పరిస్థితులు ఏర్పడటం ద్వారా భారత్‌లో మంచి వర్షపాతం నమోదవుతుందన్నారు. రాబోయే వర్షకాలం రెండో అర్ధభాగంలో లానినా ఏర్పడే అవకాశముందన్నారు.

కీలక ప్రభుత్వ పదవుల్లో ప్రైవేటు వ్యక్తులు

25 మంది నియామకానికి కేంద్రం పచ్చజెండా

న్యూఢిల్లీ, మార్చి 1: కేంద్ర ప్రభుత్వంలోని మరికొన్ని కీలక పదవులను త్వరలోనే నిపుణులైన ప్రైవేటు వ్యక్తులతో భర్తీ చేయనున్నారు. వివిధ ప్రభుత్వ విభాగాల్లో సంయుక్త కార్యదర్శులుగా ముగ్గురు, డైరెక్టర్లు, డిప్యూటీ సెక్రటరీలుగా 22 మంది ప్రైవేటు వ్యక్తులను నియమించేందుకు ప్రధాని మోదీ నేతృత్వంలోని క్యాబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆమోదించింది. ఈ పోస్టుల్లో ఐఎఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ తదితర అధికారులను నియమించాల్సి ఉంటుంది. అయితే వివిధ రంగాలకు చెందిన నిపుణులను భాగం చేసేందుకు 2018 నుంచి ఇలా ప్రైవేటు వ్యక్తుల నియామకం ప్రారంభించారు. ప్రస్తుతం జాయింట్ సెక్రటరీలుగా 8 మంది, డైరెక్టర్లుగా 16 మంది, డిప్యూటీ సెక్రటరీలుగా తొమ్మిది మంది ప్రైవేట్ వ్యక్తులు వేర్వేరు ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్నారు. ప్రైవేటు రంగాలకు చెందిన నిపుణులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ, స్వయంప్రతిపత్తి కలిగిన, ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్న వారిని కూడా ఈ విధంగా నియమించనున్నారు.

కర్ణాటకలో ఐదు హామీల అమలుకు సవాలక్ష నిబంధనలు

అర్హుల సంఖ్యను కుదించడమే కాంగ్రెస్ సర్కారు లక్ష్యం

ఆశ పెట్టి మోసం చేశారని కన్నడిగుల ఆగ్రహం

ఖజానాపై భారం తగ్గించేందుకు మరిన్ని రూల్స్!

కాంగ్రెస్ మ్యానిఫెస్టోను చూపుతున్న సీఎం సిద్ధరామయ్య, పక్కన డీకే శివకుమార్ (ఫైల్)

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): ఐదు గ్యారెంటీల పేరిట కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. హామీలను సంపూర్ణంగా అమలు చేయకుండా ప్రజలకు చుక్కలు చూపిస్తున్నది. గ్యారెంటీల అమలుకు అయ్యే వ్యయాన్ని తగ్గించుకోవడానికి, లబ్ధిదారుల సంఖ్యను కుదించడానికి ప్రభుత్వం సవాలక్ష నిబంధనలు తీసుకొచ్చింది. ఉచిత విద్యుత్తు అంటూ ఊదరగొట్టి ఛార్జీల పెంపునకు తెర తీసింది. మహిళలకు ఆర్థిక భరోసా ఇస్తామన్న 'గృహలక్ష్మి' స్కీమ్‌కు కొత్త ఆంక్షలు జోడించింది. ఆడబిడ్డలకు ఉచిత బస్సు సర్వీసులంటూ ఊరించిన 'శక్తి' స్కీమ్‌లో వయసు, వృత్తి అంటూ కొత్త పరిమితులు విధించనుంది! నిరుద్యోగులకు భృతి కల్పిస్తామన్న 'యువనిధి', పేదలకు ఉచిత బియ్యమని ఊదరగొట్టిన 'అన్నభాగ్య' ఇలా ప్రతి పథకంలోనూ కోతలు విధిస్తున్నది. దీంతో సిద్ధరామయ్య ప్రభుత్వంపై కన్నడిగులు భగ్గుమంటున్నారు. ఎన్నికల సమయంలో హామీల పేరుతో ఆశ చూపిన కాంగ్రెస్.. ఇప్పుడు కొత్త నిబంధనలు తీసుకొచ్చి మోసం చేసిందంటూ మండిపడుతున్నారు.

గ్యారెంటీల్లో ఆంక్షలు ఇలా..

గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు సరఫరా చేస్తామంటూ 'గృహజ్యోతి' పేరిట కాంగ్రెస్ హామీనిచ్చింది. అధికారంలోకి రాగానే కొర్రీలు పెట్టింది. 2022 నుంచి 2023 మార్చి వరకు గృహ విద్యుత్తు వినియోగం సగటున 200 యూనిట్లకు మించని కుటుంబాలు మాత్రమే ఈ స్కీమ్‌కు అర్హులంటూ సర్కారు తొలి షాక్ ఇచ్చింది. తర్వాత 200 యూనిట్ల స్థానంలో 165 యూనిట్లను కటాఫ్‌గా కుదించింది. వినియోగదారుడికి పెండింగ్ బిల్స్ ఉంటే ఈ పథకానికి అర్హులు కారని మరో మెలిక పెట్టింది. కరెంటు చార్జీలు పెంచింది. మీటర్ల లెక్కలు కావాలన్నది. ఇక, 'శక్తి' స్కీమ్ వ్యయ నియంత్రణలో భాగంగా ఇప్పటికే అనేక మార్గాల్లో బస్సు సర్వీసులను నిలిపేసింది. గతంలో 5-10 నిమిషాలకో బస్సు వచ్చేదని, ఇప్పుడు 40 నిమిషాలకు కూడా రావట్లేదని 'ది హిందూ' మీడియా సంస్థ ఇటీవల నిర్వహించిన సర్వేలో మహిళలు మండిపడ్డారు.

జాడలేని హామీలు!

డిగ్రీ పాసైన యువతకు నెలకు రూ.3 వేలు, డిప్లొమా చేసిన వారికి రూ.1,500 భృతిగా ఇస్తామన్న 'యువనిధి' స్కీమ్ ఇప్పటికీ ప్రారంభం కాలేదు. ఉద్యోగ నోటిఫికేషన్ల జాడ కూడా లేదు. 'అన్నభాగ్య' గ్యారెంటీ కింద ఉచితంగా బియ్యం సరఫరా చేస్తామన్న సర్కారు.. కిలో బియ్యానికి రూ.34 చొప్పున 5 కిలోలకు మాత్రమే రూ.170 పేదలకు జమ చేస్తున్నది. అయితే, బహిరంగ మార్కెట్‌లో కిలో బియ్యం ధర రూ. 60 పైనే ఉన్నదని, ప్రభుత్వం ఇచ్చే రూ. 170తో నెలంతా ఎలా బతకగలమని ప్రజలు మండిపడుతున్నారు. 'గృహలక్ష్మి' పథకానికి రిజిస్ట్రేషన్ల నంబర్లతో ఫోన్లకు మెసేజీలు కూడా వచ్చాయి. అయితే, డబ్బులు మాత్రం వందల మందికి మాత్రమే జమయ్యాయి. అదీ ఒక్క నెల మాత్రమే.

మరిన్ని కొత్త నిబంధనలు

గ్యారెంటీల అమలు గుదిబండగా మారిందని సీఎం సిద్ధరామయ్య ఆర్థిక సలహాదారు బసవరాజ్ ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేశారు. '5 గ్యారెంటీలను కొనసాగించాలంటే ఏటా రూ.58 వేల కోట్లు అవసరం. ఇది ఖజానాపై పెను భారమే. గ్యారెంటీల వ్యయాన్ని తగ్గించుకోడానికి స్కీమ్‌ల నిబంధనల్లో ఏమేం మార్పుచేర్పులు తీసుకురావొచ్చనేది చర్చిస్తున్నాం.' అని బసవరాజ్ అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన 5 హామీలను అమలు చేయడానికి నిధులను ఖర్చు చేసుకుంటూ పోతే అభివృద్ధి పనులు పడకేయడం ఖాయమన్న ఆందోళనను కూడా వ్యక్తం చేశారు.

కర్ణాటక ఐదు గ్యారెంటీలు -వాటి దుస్థితి

పథకం	కలిగే లబ్ధి	మొత్తం అర్హులు (అంచనా)	అందుకుంటున్నది..
గృహలక్ష్మి	ఇంటి మహిళా పెద్దకు నెలకు రూ. 2000	1.9 కోట్లు	వందల సంఖ్యలోనే
గృహజ్యోతి	200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు	2.14 కోట్ల కుటుంబాలు	8 లక్షల కుటుంబాలు
యువనిధి	డిగ్రీపాసైన యువతకు నెలకు రూ. 3000 భృతి	60 లక్షలు	-
అన్నభాగ్య	ప్రతి వ్యక్తికి నెలకు 10 కిలోల ఉచిత బియ్యం	7 కోట్లు	బియ్యానికి బదులు రూ. 170 మాత్రమే చెల్లింపు
శక్తి	ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం	4 కోట్లు	బస్సు సర్వీసులు ఎడాపెడా రద్దు. కొత్త నిబంధనలు

సమ్మతి లేకుండా లైంగిక ధోరణి వెల్లడించొద్దు

న్యూఢిల్లీ, మార్చి 1: వ్యక్తుల సమ్మతి లేకుండా వారి లైంగిక ధోరణిని బ్రాడ్‌కాస్టర్లు వెల్లడించరాదని న్యూస్ బ్రాడ్‌కాస్టింగ్ అండ్ డిజిటల్ స్టాండర్డ్స్ అథారిటీ (ఎన్‌బీడీఎస్ఏ) తెలిపింది. వ్యక్తి ప్రాధాన్యమిచ్చే పేర్లు, సర్వనామాలను గౌరవించాలని చెప్పింది. స్త్రీ, పురుష, నపుంసక వంటి భేదాలు బయటకు వెల్లడి కాకుండా తటస్థంగా ఉండే పదాలను ఉపయోగించాలని తెలిపింది. ఎల్‌జీబీటీక్యూఐఏప్లస్ వ్యక్తులకు సంబంధించిన అంశాలను, వార్తలను ప్రసారం చేసేటపుడు ఈ మార్గదర్శకాలను పాటించాలని చెప్పింది. వీరి గురించి సున్నితత్వం, కచ్చితత్వం లేకుండా చేసే రిపోర్టింగ్ వల్ల తీవ్రమైన సాంఘిక పర్యవసానాలు ఉంటాయని హెచ్చరించింది.

జ్ఞానవాపీ కమిటీ పిటిషన్ విచారణకు అంగీకారం

సుప్రీంకోర్టు వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 1: జ్ఞానవాపీ మసీదు ఉన్న చోట ఆలయాన్ని పునరుద్ధరించాలన్న వ్యాజ్యాలపై అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను జ్ఞానవాపీ మసీదు మేనేజ్‌మెంట్ కమిటీ సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. ఈ పిటిషన్‌ను విచారణకు తీసుకుంటున్నట్టు కోర్టు శుక్రవారం తెలిపింది. మసీదు ఉన్న స్థలంలో ఆలయాన్ని పునరుద్ధరించాలని కోరుతూ 1991లో దావాను కొనసాగించటాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను అలహాబాద్ హైకోర్టు గత ఏడాది డిసెంబర్ 19న కొట్టివేసింది. వివాదాస్పద స్థలం మతపరమైన స్వభావాన్ని కోర్టు మాత్రమే నిర్ణయిస్తుందని హైకోర్టు పేర్కొంది.

వాణిజ్య సిలిండర్ ధర రూ.25 పెంపు

న్యూఢిల్లీ: వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరలు మరోసారి పెరిగాయి. 19 కేజీల కమర్షియల్ సిలిండర్ రేటు రూ.25.50 పెంచుతున్నట్టు కేంద్ర చమురు సంస్థలు శుక్రవారం ప్రకటించాయి. తాజా పెంపుతో ఢిల్లీ, ముంబైలలో వాణిజ్య సిలిండర్ ధర రూ.1795, రూ.1749కి పెరిగింది. కేంద్ర ప్రభుత్వం ఈ ధరలను పెంచడం వరుసగా ఇది రెండోసారి.

'మహదేవ్' కేసులో 580 కోట్లు ఫ్రీజ్

న్యూఢిల్లీ: మహదేవ్ యాప్ కేసుకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో రూ.580 కోట్లకుపైగా సెక్యూరిటీ హోల్డింగ్స్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) స్తంభింపజేసింది. అంతే కాకుండా రూ.3.64 కోట్ల నగదు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకుంది. తాజా దాడుల అనంతరం ఈ చర్యలు చేపట్టామని ఈడీ శుక్రవారం వెల్లడించింది. ఈ ఆస్తులు దుబాయ్‌లోని హవాలా ఆపరేటర్ హరిశంకర్ టిబ్రేవాలాకు చెందినవని తెలిపాయి. మహదేవ్ కేసులో ఈడీ ఫిబ్రవరి 28న కోల్‌కతా, గురుగ్రామ్, ఢిల్లీ, ఇండోర్, ముంబై, రాయ్‌పూర్‌లలో సోదాలు చేసింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఉన్నత స్థాయి రాజకీయ నేతలు, బ్యూరోక్రాట్ల ప్రమేయం ఉంది. హరిశంకర్ మహదేవ్‌యాప్ ప్రమోటర్లకు భాగస్వామి. సొంతంగా స్కైఎక్స్ఛేంజ్ అనే బెట్టింగ్ యాప్‌ను కూడా నిర్వహిస్తున్నారు. మొత్తం మీద ఇది దాదాపు రూ.6 వేల కోట్ల కుంభకోణమని సమాచారం.

39 వేల కోట్లతో రక్షణ పరికరాల ఒప్పందం

న్యూఢిల్లీ, మార్చి 1: భారత రక్షణ రంగం బలోపేతమే లక్ష్యంగా మరో కీలక ముందడుగు పడింది. రూ.39,125 కోట్ల విలువైన ఐదు ప్రధాన రక్షణ పరికరాల కొనుగోలుకు సంబంధించిన ఒప్పందాలపై భారత్ శుక్రవారం సంతకాలు చేసింది. వివిధ సంస్థలు బ్రహ్మోస్ సూపర్‌సానిక్ క్రూయిజ్ క్షిపణుల కొనుగోలుతో సహా రాడార్లు, ఆయుధ వ్యవస్థలు, మిగ్-29 జెట్‌ల ఏరో ఇంజిన్లను సరఫరా చేయనున్నాయి. వీటిలో రూ.19,518 కోట్ల ఒప్పందంలో భాగంగా బ్రహ్మోస్ సూపర్ సానిక్ క్షిపణులను బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్(బీఏపీఎల్) రక్షణ శాఖకు అందించనున్నది. చైనా, పాకిస్థాన్‌తో సరిహద్దుల్లో ఉద్రిక్తతలునేపథ్యంలో రక్షణ రంగంలో ఈ ఒప్పందాలు జరగడం గమనార్హం.

రామేశ్వరం కేఫ్ సీసీటీవీ కెమెరాలో రికార్డయిన పేలుడు దృశ్యం

బెంగళూరు కేఫ్‌లో బాంబు పేలుడు!

- 10 మందికి తీవ్రగాయాలు
- ఐఈడీ పరికరాల వల్లే: సిద్ధరామయ్య

బెంగళూరు: కర్ణాటక రాజధాని బెంగళూరులోని ప్రముఖ రెస్టారెంట్ రామేశ్వరం కేఫ్‌లో శుక్రవారం భారీ బాంబు పేలుడు సంభవించింది. ఈ ఘటనలో మొత్తం 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై సీఎం సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడుతూ 'మధ్యాహ్నం 12.30 గంటలకు పేలుడు జరిగింది. ఎన్ఐఏ, బాంబ్ స్క్వాడ్, ఫోరెన్సిక్ నిపుణులు దీనిపై దర్యాప్తు చేస్తున్నారు. ఐఈడీ పరికరాల్ని ఉపయోగించి పేలుడుకు పాల్పడ్డారు' అని అన్నారు.

రెండు కోణాల్లో దర్యాప్తు

రామేశ్వరం కేఫ్ పేలుడు ఘటనలో దర్యాప్తు సంస్థలు రెండు కోణాలను పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. వీటిలో ఒకటి ఉగ్ర వాద కోణం కాగా, మరొకటి వ్యాపార శత్రుత్వం. ఈ కేఫ్‌కు సంబంధించిన శాఖలన్నీ బాగా వ్యాపారం చేస్తుండటంతో, వాటి ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలు జరగవచ్చునని ఓ వారం నుంచి సంకేతాలు వస్తున్నట్లు చెప్తున్నారు.

హైదరాబాద్‌లో హై అలర్ట్

హైదరాబాద్ సిటీబ్యూరో (నమస్తే తెలంగాణ): బెంగళూరులో బాంబు పేలుడుతో హైదరాబాద్ పోలీసులు అలర్ట్ అయ్యారు. బస్‌స్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు, ఇతర రద్దీ ప్రాంతాలలో శుక్రవారం సాయంత్రం నుంచి వాహనాల తనిఖీలు నిర్వహించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. బాంబ్‌స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు.



రైలు+విమానం=టీ ఫ్లైట్

చైనా నుంచి సూపర్‌సోనిక్ అల్ట్రాట్రైన్ • గరిష్ఠంగా గంటకు 2 వేల కి.మీ. స్పీడ్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, (నమస్తే తెలంగాణ): హైస్పీడ్ ట్రైన్స్‌కు పెట్టింది పేరైన చైనాలో ఇప్పుడు మరో అత్యాధునిక, సూపర్ సోనిక్ అల్ట్రా హైస్పీడ్ ట్రైన్‌ను అభివృద్ధి చేశారు పరిశోధకులు. ఆకృతిలో రైలును పోలి, వేగంలో విమానానికి తీసిపోని ఈ ట్రైన్‌కు 'టీ-ఫ్లైట్'గా నామకరణం చేశారు. దీనికి చక్రాలు ఉండవు. ఎలక్ట్రో మ్యాగ్నెటిక్ శక్తితో ట్రాక్‌పై గాలిలో తేలియాడుతూ నడుస్తుంది. దీంతో పట్టాలు, చక్రాల మధ్య ఘర్షణ అనే సమస్యే ఉండకపోవడంతో లక్షిత వేగాన్ని రైలు సులభంగా అందుకోగలదు.

మాజీ మిస్ ఇండియా త్రిపుర క్యాన్సర్‌తో మృతి

న్యూఢిల్లీ, మార్చి 1: మాజీ మిస్ ఇండియా త్రిపుర రింకీ చక్మా క్యాన్సర్‌తో మృతి చెందారు. 28 ఏండ్ల రింకీ చక్మా గత రెండేండ్లుగా క్యాన్సర్‌తో పోరాడుతున్నారు. ఈ మేరకు ఫెమినా మిస్ ఇండియా సామాజిక మాధ్యమంలో ఈ విషయాన్ని వెల్లడిస్తూ ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేసింది. తనకు సోకిన మహమ్మారి గురించి రింకీ గత నెలలోనే ఇన్‌స్టాలో అభిమానులతో పంచుకుంది. కాగా, మానూషి చిల్లర్ 2017లో మిస్ ఇండియా అవార్డు గెలిచినప్పుడు రింకీ చక్మా 'బ్యూటీ విత్ పర్‌పస్' అవార్డును నెగ్గింది.

'అయోధ్య' పురావస్తు శాస్త్రవేత్త అరుణ్‌కుమార్ కన్నుమూత

రాయ్‌పూర్, మార్చి 1: ప్రముఖ పురావస్తు శాఖ శాస్త్రవేత్త డాక్టర్ అరుణ్‌కుమార్ శర్మ(90) కన్నుమూశారు. వృద్ధాప్య అనారోగ్య కారణాలతో ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లోని ఆయన నివాసంలో బుధవారం అర్ధరాత్రి చనిపోయారు. అలహాబాద్ హైకోర్టు ఆదేశాల మేరకు అయోధ్యలో శ్రీరామ జన్మభూమి ప్రాంతాన్ని వెలికితీసిన శాస్త్రవేత్తల బృందంలో అరుణ్ కుమార్ అత్యంత సీనియర్ సభ్యులు. ఆ ప్రాంతంలోని ఆలయాన్ని కూల్చి మసీదు నిర్మించారని పేర్కొంటూ అరుణ్ కుమార్ టీమ్ న్యాయస్థానానికి నివేదిక ఇచ్చింది. అయోధ్య వివాదాస్పద ప్రాంతంలో రాముడి ఆలయం ఉనికి ఉందన్న వాదనకు మద్దతుగా శర్మ పలు పురావస్తు ఆధారాలు సేకరించారు. వృత్తి నిబద్ధతకు పేరొందిన అరుణ్‌కుమార్ 83 ఏండ్ల వయసులో బస్తర్ రీజియన్‌లో నక్సల్స్ 67 ముక్కలుగా చేసిన గణేశుడి విగ్రహ పునరుద్ధరణ పనులను తన బృందంతో కలిసి వారంలో పూర్తి చేశారు. 2017లో కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ పురస్కారాన్ని ప్రదానం చేసింది.



అమిత్ షా కారు నెంబర్ ప్లేట్‌పై 'సీపఏ'

న్యూఢిల్లీ: కేంద్ర హోంమంత్రి అమిత్ షా కారు నెంబర్ ప్లేట్‌కు సంబంధించిన ఫోటోలు, వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కారు నెంబర్‌లో 'సీపఏ' అనే ఇంగ్లీష్ అక్షరాలు ఉండటమే ఇందుకు కారణం. 2019లో తెచ్చిన సీపఏ ప్రకారం బంగ్లాదేశ్, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్థాన్ దేశాల నుంచి భారత్‌కు వలస వచ్చిన హిందువులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్శీలు, క్రైస్తవులకు భారత పౌరసత్వం పొందేందుకు వీలుంది. అయితే, సీపఏకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు జరగడంతో చట్టాన్ని అమలు చేయలేదు. పార్లమెంటు ఎన్నికల కోడ్ వచ్చే లోగా సీపఏ నోటిఫై చేయాలని కేంద్రం భావిస్తున్నది.

ఓపెన్ ఏఐపై మస్క్ దావా

శాన్‌ఫ్రాన్సిస్కో: చాట్‌జీపీటీ రూపకర్త సంస్థ ఓపెన్ ఏఐపైనా, దాని సీఈఓ శామ్ ఆల్ట్‌మన్‌పైనా టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ దావా వేశారు. మానవాళి ప్రయోజనాల కోసం కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ను అభివృద్ధి చేయడం ఆ కంపెనీ అసలు లక్ష్యమని, అయితే దాన్ని ఆ కంపెనీ వదిలి పెట్టిందని మస్క్ ఆరోపించారు. లాభాపేక్ష లేని విధంగా, అందరికీ అందుబాటులో ఉండే విధంగా కృత్రిమ మేధను రూపొందించేందుకు తనను ఆల్ట్‌మన్, ఓపెన్ ఏఐ సహ వ్యవస్థాపకుడు గ్రెగ్ బ్రోక్‌మన్ మొదట్లో సంప్రదించారని గురువారం దాఖలు చేసిన ఈ దావాలో మస్క్ వెల్లడించారు. అయితే ఈ కంపెనీ ఆ కాంట్రాక్టును ఉల్లంఘించిందని ఆరోపించారు. జీపీటీ-4 డిజైన్‌ను పూర్తి రహస్యంగా ఉంచిందన్నారు. 2015లో ఓపెన్‌ఏఐ వ్యవస్థాపకుల్లో మస్క్ ఒకరు. ఆయన 2018లో దీని బోర్డు నుంచి వైదొలగారు.

కుల మతాల పేరిట ఓట్లడగొద్దు

కించపరిచే, తప్పుడు పోస్టులు పెట్టొద్దు: ఈసీ

న్యూఢిల్లీ, మార్చి 1: త్వరలో జరగబోయే లోక్‌సభ, అసెంబ్లీల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ఎన్నికల సంఘం రాజకీయ పార్టీలకు శుక్రవారం అడ్వైజరీ జారీ చేసింది. కులం, మతం, భాష ప్రాతిపదికన పార్టీలు, నేతలు ఓట్లు అడగడాన్ని నిషేధించింది. మత ప్రదేశాలను ప్రచారానికి వినియోగించరాదని పేర్కొన్నది. సామాజిక మాధ్యమాల్లో ప్రత్యర్థులను కించపరిచే పోస్టులు, అసత్య ప్రచారానికి సంబంధించిన పోస్టులను ఉంచడం కానీ, షేర్ చేయడం గానీ చేయరాదని ఈసీ హెచ్చరించింది. అభ్యర్థులు, క్యాంపెయినర్లు ఈ నిబంధనావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది.

ఎంపీ, ఎమ్మెల్యేల శరీరాల్లో చిప్ పెట్టాలా!?

'పర్యవేక్షణ' పిటిషన్‌ను కొట్టేసిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, మార్చి 1: మెరుగైన పాలన కోసం చట్టసభ సభ్యుల కదలికలను 24 గంటల పాటు పర్యవేక్షించేలా కేంద్రాన్ని ఆదేశించాలన్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం కొట్టేసింది. ఈ సందర్భంగా పిటిషన్‌దారుకు ధర్మాసనం తలంటింది. ఎంపీ, ఎమ్మెల్యే కదలికలను మానిటరింగ్ చేయటం వారి గోప్యతా హక్కుకు భంగమని పేర్కొన్నది. మీరు చెప్పినట్టు చేయాలంటే సభ్యుల శరీరాల్లో చిప్ అమర్చాలా? అని పిటిషన్‌దారును ప్రశ్నించింది. అనవసర అంశాలతో కోర్టు సమయం వృథా చేసినందుకు రూ.5 లక్షల జరిమానాకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించింది. దోషుల విషయంలో ఆలోచించవచ్చు కానీ.. సభ్యులంతా దోషులంటే ఎలా? అని నిలదీసింది.

యూపీలో 12వ తరగతి ప్రశ్నపత్రాలు లీక్

లక్నో, మార్చి 1: బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో మరోసారి ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారం వెలుగుచూసింది. ఆగ్రా జిల్లాలోని ఫతేపూర్ సిక్రిలో గురువారం 12వ తరగతి బోర్డు పరీక్ష ప్రశ్నాపత్రాలు వాట్సాప్ గ్రూపులో షేర్ అయ్యాయి. రాజ్‌హాలిలోని అతర్ సింగ్ ఇంటర్ కాలేజ్ ప్రిన్సిపల్ కుమారుడు 'ఆల్ ప్రిన్సిపాల్స్ ఆగ్రా' అనే వాట్సాప్ గ్రూపులో గణితం, జీవశాస్త్రం ప్రశ్నా పత్రాలను షేర్ చేశాడు. పరీక్ష ప్రారంభమైన గంట తర్వాత పేపర్లు లీక్ అయ్యాయని అధికారులు తెలిపారు. అధికారుల ఫిర్యాదు మేరకు కళాశాల ప్రిన్సిపల్, అతడి కుమారుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, ఇటీవలే యూపీ ప్రభుత్వం లీకేజీ ఆరోపణలతో పోలీస్ కానిస్టేబుల్ నియామక పరీక్షను రద్దు చేసింది.

పొగాకు కంపెనీపై ఐటీ దాడులు

కోట్ల రూపాయల ఆస్తులు గుర్తింపు

న్యూఢిల్లీ, మార్చి 1: ప్రముఖ పొగాకు వ్యాపార సంస్థ బంశీధర్ గ్రూప్‌పై ఆదాయపు పన్ను శాఖ అధికారులు జరిపిన దాడుల్లో కండ్లు చెదిరే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ సంస్థ యాజమాని శివమ్ మిశ్రా వద్ద లంబోర్గిని, మెక్‌లారెన్, రోల్స్ రాయిస్ ఫాంటమ్, పోర్షె వంటి అనేక లగ్జరీ కార్లను ఐటీ అధికారులు గుర్తించారు. ఈ కార్ల విలువ దాదాపుగా రూ.50 కోట్లు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఢిల్లీ, యూపీ, గుజరాత్‌తో పాటు పలు రాష్ట్రాల్లోని 20 ప్రాంతాల్లో ఐటీ అధికారులు శుక్రవారం ఏక కాలంలో దాడులు జరిపారు. సోదాల్లో రూ.4.5 కోట్ల నగదును సైతం స్వాధీనం చేసుకున్నారు. పొగాకు సరఫరా చేసే ఈ కంపెనీ టర్నోవర్ రూ.100 - 150 కోట్లమేర ఉన్నప్పటికీ రూ.20 కోట్లు మాత్రమే అధికారికంగా చూపిస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

మణిపూర్‌లో ఎన్ఆర్‌సీ కోసం మళ్లీ తీర్